# ప్రసంగ వేదికగా మార్చబడిన సిలువ (మత్తయి 27:46; లూకా 23:34-46; యోహాను 19:25-30)

క్రీస్తు జన్మించిన తరువాత, రమారమి ముప్పైమూడున్నర సంవత్సరాలకు, గొల్గొతా అనే గుడిలో, శుక్రవారం పస్కాపండుగకు ముందు, ప్రసంగ వేదికగా మార్చబడిన సిలువపైనుండి ప్రపంచ చరిత్రలో మహోన్నమైన వీడ్కోలు ప్రసంగం ప్రసంగించబడింది.

వేలాది సంవత్సరాలలో జీవించిన వందలకొలది స్త్రీ, పురుషుల మాటలతో పాటు చనిపోయే సమయంలో పలికిన కొందరి మాటలనే పరిశుద్ధ లేఖనాలు పూర్తిగా దాఖలు చేశాయి, వీరిలో: మొదటిది ఇశ్రాయేలు మాటలు; రెండవది, మోషే మాటలు; మూడవది, స్తెఫను మాటలు. ఏర్పరచబడిన జనాంగంలో ఇశ్రాయేలు మొదటివాడు; ధర్మశాస్త్ర యుగానికి మోషే మొదటివాడు; క్రైస్తవులలో హతసాక్షిగా స్తెఫను మొదటివాడు. ఏది యెలాగున్నా, కల్వరి వాయువులలో నుండి వెలువడిన సప్త స్వరాలలోని విమోచనా సందేశాన్ని సువార్త లేఖికులు వినగలిగినట్టుగా, చనిపోతున్న ఆ మనుష్యుల మెల్లని మాటలను ఏ చెవులూ వినలేదనే చెప్పాలి.

### క్షమాపణా మాటలు: ''వీరిని క్షమించుము'' (లూకా 23:34)

సిలువ ఊరేగింపు కల్వరికి చేరగానే, ప్రభువైన యేసు బట్టలు ఊడదీయబడ్డాయి. దీనికి ఐదు రోజులు ముందుగా, తన మార్గం పొడవున, క్రింద పరిచేలా జనులు తమ బట్టలను విప్పారు; అయితే యిప్పుడు ఆయన బట్టలే విప్పబడ్డాయి. ఎవరికి కీడు చేయని; లోకం మీదికి దీవెనలు కురిపించే ఆయన హస్తాలు, శిక్షించేవారికి అప్పగించబడ్డాయి. ఆయనను సిలువకు మేకులతో కొట్టిన ధ్వని, క్రిందనున్న పట్టణపు ప్రాకారంనుండి ప్రతిధ్వనించింది. కడకు సిలువ నెమ్మదిగా పైకెత్తబడి, దాన్ని నిలుపుటకై తీయబడిన గోతిలోనికి ఎత్తివేసిన చప్పుడు ఆకాశమే కదిలింపబడినట్టనిపించింది. ప్రభువైన యేసు తన చివరి ప్రసంగవేదికను ఎక్కారు.

దీనికిముందు, తన వ్యక్తిగతమైన పరిచర్యలో, ఆయన అనేక ప్రసంగ వేదికల నుపయోగించుకొన్నారు. కొండమీద, మిద్దెమీద, పడవమీద, బావియొద్ద వగైరా స్థలాలను యేసు ప్రసంగ వేదికలుగా చేసికొన్నారు. అయినా ప్రభువులా, చనిపోతూ ప్రసంగించిన బోధకుడెవడూలేడు. కపాలమనబడే స్థలంలో కూడిన సంఘం వంటిది ఎక్కడాలేదు. చివరి ఏడు మాటల వంటి యేసు ప్రసంగం ఎన్నడూ చేయబడలేదు.

కల్వరిలో నుండి ప్రభువు పలికిన పలుకులలో తొలిపలుకు- క్షమాపణను గూర్చినది: ''తండ్రీ, వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుము'' (లూకా 23:34). యేసు పలికిన నాలుగు, ఏడు - మాటలవలెనే తొలిపలుకులు ప్రార్థనయైయుంది. అంటే - యేసు యొక్క తొలి - మధ్య - చివరి వేదనకరమైన మాటలు, పరిశుద్ధమైన దైవసహవాసంలో మునిగి తేలినట్టున్నాయ్.

సిలువపైనుండి జనులు ప్రార్థించడమనేది అరుదు. మరణం ఎంత వేదనకర మయ్యిందిగా ఉండగలదో అంత వేదనకరంగా చేయడానికి గాను, నీతి తప్పిన జనులు సిలువ మరణాన్ని కనిపెట్టారు. కఠోరమైన ఈ శిక్ష విధింపబడినప్పుడు, సిలువపై నుండి జనులు సహజంగా, కీచుమని కేకలువేస్తారు, లేదా ప్రేక్షకులను వేడు కొంటారు,లేదా శపిస్తారు. వారిపై ఉమ్మివేయజూస్తారు. కాని ప్రభువైన యేసైతే సిలువపైనుండి దేవునికి ప్రార్థించారు.

ప్రభువైన యేసుయొక్క తొలి ఆలోచన తన బాధను గూర్చినది కాదుగాని, తన్ను బాధిస్తున్నవారు తమకు తామే చేసికొంటున్న హానిని గూర్చినదైయుంది. గంధపుచెట్టు తన్ను నరుకు గొడ్డలిని సుగంధంలో జలక్రీడలాడించినట్టు ప్రభువు పలికిన ఈ మాటలున్నాయి: ''తండ్రీ నాయొద్దనుండి నీ కనికరం దూరం చేయబడినా, వీరి యొద్దనుండి మాత్రం దానిని దూరం చేయకుమన్నట్టు,'' యేసు తండ్రికి ప్రార్థించారు.

తన పరిచర్యలో ప్రభువైన యేసు పలుమార్లు ''క్షమాపణ'' అనే అంశంపై బోధించారు.

> ''మా ఋణస్థులను మేము క్షమించియున్న ప్రకారము మా ఋణములు క్షమించుము. మనుష్యుల అపరాధములను మీరు క్షమించినయెడల, మీ పరలోకపు తండ్రియు మీ అపరాధములను క్షమించును. మీరు మనుష్యుల అపరాధములను క్షమింపక పోయినయెడల మీ తండ్రియు మీ అపరాధములను క్షమింపడు'' (మత్తయి 6:12, 14-15).

> ''ఆ సమయమున పేతురు ఆయన యొద్దకు వచ్చి- ప్రభువా, నా సహోదరుడు నా యెడల తప్పిదము చేసిన యెడల నేనెన్నిమారులు అతని క్షమింపవలెను? ఏడు మారులమట్టుకా? అని అడిగెను. అందుకు యేసు అతనితో ఇట్లనెను - ఏడు మారులు మట్టుకే కాదు, డెబ్బది ఏళ్ల మారులమట్టుకని నీతో చెప్పుచున్నాను. మీలో ప్రతివాడును తన సహోదరుని హృదయ పూర్వకముగా క్షమింపనియెడల నా పరలోకపు తండ్రియు ఆ ప్రకారమే మీ యెడల చేయుననెను'' (మత్తయి 18:21-22, 35).

క్షమాపణను గూర్చి యేసుచేసిన అత్యుత్తమమైన ఉపదేశం సిలువపైనుండి చేసినదే! ఏలాగంటే - ఆయన ఉపదేశించిన దానిని, తాను సిలువపైనుండి ప్రత్యక్షంగా కనుపరిచారు!!

లూకా 23:34లోని క్రియావాచకం, గ్రీకులో అసంపూర్ణమైనదిగా కన్పించడంలో ఈ కార్యం గతంనుండి జరుగుతూనే వస్తున్నట్లు సూచిస్తోంది. మన పాఠ్యభాగం ఇంగ్లీషులో ''అయితే యేసు చెప్పుచుండెను'' అని ఉంది. గాని, ''అయితే యేసు చెప్పుతునే ఉన్నారు'' అని తర్జుమా చేయవచ్చునట. మరోవిధంగా చెప్పాలంటే - యేసు ఆ మాటలనే అనేక పర్యాయములు చెప్పియుండవచ్చునట.

కపాలమనబడిన స్థలానికి చేరుకున్నప్పుడు, ఆయన చుట్టు పారజూచి, ''తండ్రీ, వీరేమిచేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుమని'' ప్రార్థించియుండవచ్చును. ఈలాటి ఒక దృశ్యం సాధ్యమే. శతాధిపతి నేలమీదికి ఆయన్ను పడనెట్టినప్పుడు, ''తండ్రీ వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుమని'' యేసు ప్రార్థించియుండవచ్చు. మొనటైన మేకులు ఆయన అరచేతులలోగుండ దించబడుచున్నప్పుడు, ''తండ్రీ, వీరేమిచేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుమని'' యేసు ప్రార్థించియుండవచ్చు. జనసమూహం ఆయనను శపించుతూ, దూషించుచుండినప్పుడు - ''తండ్రీ, వీరేమిచేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుమని'' - యేసు ప్రార్థించియుండవచ్చు. సైనికులు ఆయన వస్త్రముకొరకు చీట్లు వేసికొంటున్నప్పుడు - ''తండ్రీ, వీరేమిచేయు చున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుమని'' యేసు ప్రార్థించియుండవచ్చు. గ్రీకు పదప్రయోగాన్నిబట్టి, యిలాటి దృశ్యం సాధ్యమని రచయిత భావిస్తున్నాడు.

వివరాలు మనకు సరిగా తెలియకపోయినా, ''తండ్రీ వీరేమిచేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుమని'' ప్రభువు ప్రార్థించుతూ ఉన్నట్లు - మనకు తెలుసునని - రచయిత అంటున్నాడు.

అయితే మనమిక్కడ గమనించవలసిందేమంటే - తండ్రియొద్దనుండి వారికి క్షమాపణ, పెంతెకొస్తు దినం వరకు ప్రసాదింప బడియుండలేదు. అందులోకూడ, ''క్షమాపణ'' అనేది మారు మనస్సు పొంది, ఆజ్ఞాపింపబడిన రీతిగా - బాప్తిస్మం పొందినవారికి మాత్రమే లభించినట్లుంది (అపొ.2:38 చూడుము). ఇక్కడ ''క్షమాపణ'' అనే దానికంటెకూడా, ప్రభువైన యేసు (భయంకరమైన హింసకు, అవమానానికి గురిచేయబడ్డా, అలా చేస్తున్నవారిపట్ల) ఆయన మృతినొందు సమయంలో సహితం, శత్రు స్వభావాన్ని - ఎంతమాత్రం కనుపరచలేదని నొక్కిచెప్పడమే ప్రస్తుతపు ఉద్దేశమై యుంది. నేను, నీవు - మన ప్రభువువలె ఉండ నేర్చుకోవాలి. పరలోకపు తండ్రికి మనముకూడా కుమారులమైయుండేలా, మన

శత్రువులను ప్రేమించి, మనలను హింసించే వారికొరకు ప్రార్థనచేయాలి (మత్తయి 5:44)!

## నిరీక్షణతో కూడిన పలుకులు: "నాతోకూడ" (లూకా 23:39-43)

శిక్షకు గురియైనవారు సిలువమీద నిలిచియుండగా, వారికది యొక యుగమన్నట్టు భావింపబడుతూ ఉంటుంది. హేళనచేసే గుంపు సిలువచుట్టు నిలిచియుండడమనేది వారి వెర్రి ఆవేశానికి హేతువైయుంటుంది. అలాటి సమయంలో - ''వీడితరులను రక్షించును, తన్నుతాను రక్షించుకొనలేడు. ఇశ్రాయేలు రాజగు క్రీస్తు ఇప్పుడు సిలువ మీదనుండి దిగి రావచ్చును. అప్పుడు మనము చూచి నమ్ముదమని'' కేకలు వేస్తుంటే - ప్రభువు ఏమనుకొనేవారో! (మార్కు 15:31b, 32a). పైగా, ఆయనతో కూడ సిలువవేయబడినవారు కూడా ఆయనన్ను నిందించినట్టు మార్కు, రికార్డు చేశాడు (మార్కు 15:32b).

ఆ యిద్దరు దొంగల్లో ఒకడు-వారిరువురి మధ్య సిలువవేయబడిన యేసు వ్యత్యాసంగా ఉన్నట్టు గుర్తించాడు. యేసును గూర్చిన వాస్తవాల్లో ఏదో ఒకటి ఆ దొంగ హృదయాన్ని తాకినట్టుంది. అది ఒకవేళ - మరణాన్ని ఎదుర్కొనడంలో యేసు కనుపరచిన హుందాతనమే అయ్యుండవచ్చు. లేక ఒకవేళ - ''తండ్రీ వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుమని'' మాటి, మాటికి యేసు చెప్పుతున్న మాటలే అయ్యుండవచ్చు. వాస్తవమైన కారణాలేమైయున్నా, విశ్వాసం ఎదిగి, ఆ దొంగ హృదయంలో - అది నిశ్చయతగా మారిపోయింది. అక్కడ యిలా వ్రాయబడింది, చూడు:

> వ్రేలాడవేయబడిన ఆ నేరస్థులలో ఒకడు ఆయనను దూషించుచు - నీవు క్రీస్తువు గదా? నిన్ను నీవు రక్షించుకొనుము, మమ్మునుకూడ రక్షించుమని చెప్పెను. అయితే రెండవవాడు వానిని గద్దించి - నీవు అదే శిక్షావిధిలో ఉన్నావు గనుక దేవునికి భయపడవా? మనకైతే యిది న్యాయమే ; మనము చేసినవాటికి తగిన ఫలము పొందుచున్నాము గాని యీయన ఏ తప్పిదమును చేయలేదని చెప్పి ఆయనను చూచి - యేసూ, నీవు నీ రాజ్యములోనికి వచ్చునప్పుడు నన్ను జ్ఞాపకము చేసికొనుమనెను. అందుకాయన వానితో - నేడు నీవు నాతోకూడా పరదైసులో ఉందువని నిశ్చయముగా నీతో చెప్పుచున్నాననెను (లూకా 23:39, 43).

కనీసం సిలువమీద కూడా యేసుపై అపవాది తన పోరాటాన్ని విరమించు కోనట్టున్నాడు. అరణ్యంలో, సిలువకు వెళ్లకుండగనే ఈలోక రాజ్యాలను సంపాదించు కోవచ్చునంటూ అపవాది యేసుకు తెలియజేశాడు (మత్తయి 4:8-9). ఆయన పరిచర్యయొక్క చివరిదశలో - సిలువను గూర్చి మరచిపొమ్మన్నట్టు - అపవాది పేతురుద్వారా పలికించాడు (మత్తయి 16:21-23). ఇప్పుడు ఆయన మరణించుతూ

ఉండగా, మరణాన్ని తప్పించుకొని, సిలువపైనుండి క్రిందికి దిగి రమ్మంటూ అపవాది ఆ దొంగద్వారా సవ్వాలుచేస్తున్నాడు.

రెండింటిలో ఏదోయొకదాన్ని కోరుకొనే అవకాశం యేసుకు తన జీవితమంతటిలో ఉంది. అవేమంటే: తన్నుతాను కాపాడుకొనడమో; లేదా తన్నుతాను బలిగా సమర్పించుకొనడమో! కడకు సిలువలో సహితం అలా కోరుకొనే అవకాశం ఆయన కియ్యబడింది.

తన్నుతాను కాపాడుకోమంటూ, నమ్మని దొంగ యిలా అన్నాడు: ''నీవు క్రీస్తువు గదా? నిన్ను నీవు రక్షించుకొనుము, మమ్మును కూడా రక్షించుము'' (లూకా 23:39). ఆ దొంగ ఆయనకు ఉపదేశించిన తీరు, సాతాను అరణ్యంలో ఉపయోగించిన తీరువంటిదే! "నీవు దేవుని కుమారుడవైతే, ఈ రాళ్లు రొట్టెలగునట్లు ఆజ్ఞాపించు మనెను'' (మత్తయి 4:3). మరో విధంగా చెప్పాలంటే - ''ప్రత్యేక ప్రయోజనాలు లేకుండ "క్రీస్తు" అయ్యుండడం అర్థరహితం''మన్నట్టు అపవాది సూచించాడు. గనుక ''ఆ ప్రత్యేకతను అనుభవించు; అదే సమయంలో నీవెవరవో నిన్ను నీవు మాకు రుజువుపరచుకో!'' అన్నట్టు వాని మాటలున్నాయ్. ''- చెరసాలను పగులగొట్టే ప్రయత్నంలా'' ఆ దొంగ మాటలున్నాయని - ఎ.టి. రాబర్ట్‌సన్ అంటాడు. అలా చెరసాలను పగులగొట్టే ప్రయత్నానికి యేసు నాయకత్వం వహించుమన్నట్టు - ఆ దొంగ సలహాయిచ్చాడు.

అయితే ఆయనయందు విశ్వసించిన దొంగ-తన్నుతాను బలిగా సమర్పించు కొనడాన్నే ఎన్నుకోమంటున్నాడు: ''యేసూ, నీవు నీ రాజ్యములోనికి వచ్చునప్పుడు నన్ను జ్ఞాపకము చేసికొనుమనెను'' (లూకా 23:42). మరో విధంగా చెప్పాలంటే - ''సిలువపై నిలిచి నీ రాజ్యాన్ని నీవు సంపాదించుకోమని అతడు ఆయనను ప్రోత్సహించుతున్నట్టున్నాడు. ఆహా!'' అతనికున్న విశ్వాసమెలాటిదో గదా! అతడు యేసువైపు చూచినప్పుడు, శిక్షింపబడుతున్న నేరస్థుడైయున్నట్టు అతడు ఆయన్ను చూడలేదు, గాని (యుద్ధ శూరుడైయున్న మహా) రాజునే అతడు చూడగలుగు తున్నాడు ఆయన తలపైనున్న ముండ్లమకుటానికి బదులు - దానిస్థానంలో రాజ మకుటాన్ని అతడు తిలకించుతున్నాడు! యేసు చేతులలోని మేకులకు బదులు అతడు ఆయన చేతిలోని రాజదండాన్ని ఊహించ గలుగుతున్నాడు. ఆయన దేహంపై కారి, ఎండిపోయిన రక్తానికి బదులు - నీలము కలిసిన ఎరుపును, లేక ఊదారంగును చూస్తున్నాడు.

ఇక్కడ కూడా పూర్తికాని క్రియావాచకమే వినియోగింపబడింది. ఇరువైపుల నుండి ''తన్ను తాను కాపాడుకొనడం; తన్ను తాను బలిగా సమర్పించుకొనడం'' - అనే భావాలతో యిద్దరు దొంగలు యేసు చెవులను - వాద ప్రతివాదనలతో ఎదుర్కొన్నారు. దానితో ఆయన సిలువను వదలుకొనడమా? లేక సిలువలో అలాగే

నిలిచియుండడమా? అనే భావాలు ప్రతిధ్వనించాయ్!

దానికి ప్రతిఫలంగా, నమ్మికయుంచిన దొంగకు - నిరీక్షణా జనికమైన సమాధానం లభించింది: ''నేడు నీవు నాతోకూడా పరదైసులో ఉందువని నిశ్చయముగా నీతో చెప్పుచున్నానని'' ఆయన అన్నారు (లూకా 23:43).

(ప్రత్యేకించి బాప్తిస్మం లేకుండ[1]), దొంగ రక్షింపబడినట్లు మనం కూడా రక్షింపబడతామనే నిరీక్షణకు ఈ వర్తమానం ఆధారమైనట్లు మనం భావించ కూడదు. దీన్ని జాగ్రత్తగా గమనించాలి. యేసు మరణానికి ముందే ఆ దొంగ రక్షింపబడ్డాడు[2]. తాను పాతనిబంధన క్రింద రక్షింపబడిన వారికి ఉదాహరణగా ఉన్నాడే తప్ప - క్రొత్త నిబంధన క్రింద ఉన్నవారికి కాదు సుమా (కొలస్సీ. 2:14; హెబ్రీ. 9:16-17)[3]. క్రొత్త నిబంధన క్రింద - నమ్మి, బాప్తిస్మం పొందవలసిందిగా మనం ఆదేశింపబడ్డాం (మార్కు 16:16).

పైగా, ''చివరి క్షణాల్లో రక్షింపబడతామనే'' భావనకు యిది నిరీక్షణాధారం కాదు. మనకు తెలిసినంతవరకు, యేసును గూర్చి తెలిసికొనడానికి ఆ దొంగకు అదే మొదటి తరుణమని చెప్పవచ్చు. ''కడసారి చూద్దాంలే'' అన్నట్లు-సువార్తను మాటి మాటికి నిరాకరించుతూ వచ్చినవారికి ఆ దొంగ మాదిరిగాలేడు. ''పదకొండవ గంటలో''[4] రక్షింపబడగోరిన అనేకులు, పదిన్నరకే చచ్చినట్లు ఒకరన్నారు!

అయితే, ఈ సందర్భంలోని యేసు మాటలు ఏ రూపంలో - నిరీక్షణాధారమై యున్నాయ్? ఆ మాటలు నిరీక్షణాధారమై యుండడానికి తొలి కారణమేమంటే - ఆయన మొదటి దొంగయొక్క సలహాను తిరస్కరించి, రెండవ దొంగయొక్క సలహాను అంగీకరించారు. ''ఆమేన్'' - అనే దానికి గ్రీకులో ఏమి వాడతారో, ''నిశ్చయంగా'' అనే ఆ మూలంనుండే ఇది తర్జుమా చేయబడింది. అతని మాటలకు యేసు ''ఆమేన్'' అన్నట్టి భావన అందులో గోచరిస్తుంది! అంటే - అది అలా జరుగును గాక! అనేదే దాని భావం. ''నరులందరు పరదైసు వెళ్లే నిరీక్షణగలవారై యుండేలా, నేను చనిపోతాను. దైవ సంకల్పం ప్రకారమే నేను పయనిస్తాను!'' అన్నట్లు ప్రభువు మాటలున్నాయి. దానితో పరలోకమంతా, బాధ తొలిగింపబడినట్లు ఒక నిట్టూర్పు విడిచినట్లుంది!

రెండవదిగా, యేసు పలికిన ఆ మాటలు నిరీక్షణాధారం ఎలాగైయుందంటే: ఎంతటి నిరీక్షణలేని నిరాశతోకూడిన పరిస్థితిలోఒకడున్నా, అతడు రక్షింపబడే అవకాశముంది-అని అవి సూచిస్తున్నాయి. ఆ దొంగ ''ఒక్కసారే అడిగాడు, ఒక్కసారే వెదకాడు, ఒక్కసారే తట్టాడు - తన జీవితపు చివరి దినంలో రక్షింప బడ్డాడు'' - అని ఒకరన్నారు. దొంగ అలాగున రక్షింపబడితే, నీవు ఏమి చేసియున్నా సరే, నీవు కూడా రక్షింపబడగలవు. సిలువ మరణానికి తాను తగిన వాడైయున్నట్లు ఒప్పుకున్న నేరస్థునివంటి నేరం నీవు తప్పక చేసియుండకపోవచ్చు[5](లూకా 23:41)

గనుక నిరాశచెందనవసరం ఎవరికీలేదు.

ప్రభువువైపుకు తిరుగని నీ ప్రియులకు సహితం నిరీక్షణ యింకా నిలిచే ఉంది. వారి విషయంలో నిరాశచెందనవసరం లేదు. ఆ దొంగకే నిరీక్షణ ఉండినప్పుడు, వారికి నిరీక్షణ తప్పకుండా నిలిచియుంటుంది. క్రీస్తుకు అసాధ్యమైన స్థితి ఏదీలేదు!

## ఒంటరి తనాన్ని గూర్చిన పలుకులు: ''ఇదిగో నీ కుమారుడు'' (యోహాను 19:25-27)

కల్వరి దృశ్యాన్ని మనం తిలకించేటప్పుడు, అక్కడ నిలిచియున్న ప్రతి ఒక్కరు ఆయనను దూషించేవారు కాదని ఎరిగి ఆనందించాలి. అక్కడ నిలిచియున్న కొందరు ఆయన యందు శ్రద్ధ కలిగియున్నారు. సిలువచెంత - ''ఆయన తల్లియు, ఆయన తల్లి సహోదరియు, క్లోపా భార్యయైన మరియయు, మగ్దలేనే మరియయు'' - నిలిచియున్నట్టు యోహాను గుర్తించాడు (యోహాను 19:25). 26వ వచనంలో, తానుకూడా యేసు సిలువయొద్ద నిలిచియున్నట్టు చెప్పుకున్నాడు. ఆ తరువాత -పలుకులు తన తల్లిని, యోహానును ఉద్దేశించి పలికినవే.

> యేసు తన తల్లియు తాను ప్రేమించిన శిష్యుడును దగ్గర నిలుచుండుట చూచి- అమ్మా, యిదిగో నీ కుమారుడు అని తన తల్లితో చెప్పెను, తరువాత శిష్యుని చూచి- యిదిగో నీ తల్లి అని చెప్పెను (యోహాను 19:26-27).

ఈ సంభవం ద్వారా అనేక పాఠాలు నేర్చుకోవచ్చు. మొదటిది - యేసు తన తల్లి విషయంలో బాధ్యత వహించారు. ''ఎవడైనను స్వకీయులను, విశేషముగా తన యింటివారిని, సంరక్షింపకపోయిన యెడల వాడు విశ్వాస త్యాగము చేసినవాడై అవిశ్వాసికన్న చెడ్డవాడై యుండును'' అని పౌలు తిమోతికి ఉపదేశించాడు (1 తిమోతి 5:8). అప్పటికి యేసు యొక్క సహోదరులు అవిశ్వాసులై యున్నందున, తన తల్లియొక్క బాధ్యతను వారికి అప్పగించక, ఆమె యోగక్షేమాలను[7] చూచే పనిని ఆయన యోహానుకు అప్పగించారు.

అయితే ఒక సంగతి ఏమంటే - యేసు తన తల్లిని ప్రేమించినా, ఆయన ఆమెను పూజింపలేదు. ఆయన ఆమెను - ''పరలోకపు రాణి'' అనిగాని, ''దేవ మాత'' అని గాని ఆమెను పిలువలేదు. ఆమెను ఆయన అమ్మా అని సంబోధించినా, లోకులు నేడు ఆమెకు ఆరోపిస్తున్న దైవీక బిరుదులేవీ ఆమెకు ప్రభువు పెట్టలేదు. ప్రభువు పలుకులే - మరియ బొమ్మ పూజను వ్యతిరేకిస్తున్నాయ్ (దేవుని వాక్యము విని దానిని గైకొనువారు మరియకంటే ధన్యులైయుంటారని ప్రభువు ముందుగానే సూచించారు; లూకా 11:27-28 చూడు).

ప్రభువైన యేసు పలుకుల్లో ఉన్న భావాన్ని యింకా కొంచెం లోతుగా త్రవ్వి

గుర్తించుదాం. సిలువ యొక్క కేంద్ర స్థానంగా నిలిచింది - క్రీస్తేగాని; మరియగాని, యోహానుగాని కాదు. ప్రభువైన యేసుయొక్క దృష్టిలో ఆ దృశ్యాన్ని చూడ ప్రయత్నించు. ఆయన తన తల్లియొక్క క్షేమాన్ని గూర్చి అక్కర కలిగియున్నారే తప్ప, తనను గూర్చి ఏ మాత్రం కాదు, ''నీ హృదయములోనికి ఒక ఖడ్గము దూసికొని పోవునని ఆయన తల్లియైన మరియకు'' సుమయోను ముందుగానే తెలియజేశాడు (లూకా 2:35). తన కుమారుడు సిలువపై వ్రేలాడడాన్ని తాను చూచినప్పుడు, తన హృదయంలో ఖడ్గం దూసికొనిపోయినంతగా మరెన్నడు మరియకు జరిగియుండ లేదు. ఆ దృశ్యంనుండి మరియను దూరం చేయడానికే కాబోలు! ''ఆ గడియనుండి శిష్యుడు ఆమెను తన యింట చేర్చుకొనెను'' - అనే మాటలను పట్టుకొని, ఆమె సిలువ దృశ్యంతో స్పృహ తప్పి పడిపోగా, యోహాను త్వరగా ఆమెను తన యింటికి కొనిపోయినట్లు కొందరు చూచించారు.

యేసు మాటలు మరియకు సహాయం చేశాయి; కాని అవి ఆయనను ఎక్కడ విడిచిపెట్టాయ్? శ్రమానుభవంలో తన తల్లి ప్రేమకు నోచుకోలేని స్థితిలో ఆయనను వదిలాయ్! గనుక యేసు మాటలు - ''ఒంటరితనపు'' మాటలు. తన తల్లియొక్క సామీప్యం తొలిగించబడింది. త్వరలోనే - తన పరలోకపు తండ్రియొక్క సానిధ్యం కూడా తొలిగించబడనైయుంది. తన పోరాటంలో పాపంయొక్క బలాన్ని ఓడించ డానికి ఆయన ఒంటరిగానే ఉండబోతున్నారు!

దేవుని ప్రసన్నత లేకుండటాన్ని నేను పూర్తిగా అర్థం చేసి కోలేను కాని; మానవ ప్రేమకు దూరంగా (కష్ట సమయంలో) నిలిచియుండడమంటే ఎలాగుంటుందో నేను గ్రహించగలను. (శత్రు మూక మధ్య) ఒంటరిగా ఉండటమంటే ఏమో నాకు తెలుసు. అది నీకు కూడా తెలుసు ననుకుంటాను. మనం ఒంటరిగా ఉన్నప్పుడు మనమెలా భావిస్తామో ప్రభువు ఎరిగివవారై, ఆయన జయశీలియైయున్న ప్రకారం మనముకూడ జయించగలుగునట్లు ఆయన సహాయం చేయగలరు.

## బాధతో కూడిన పలుకులు "నీవు నన్నేల విడనాడితివి?"

**(మత్తయి 27:46)**

రంగ స్థలం సూటిగా సిద్ధమైయుంది. యేసు మానవ కన్నులకు కనబడనంతగా చీకటి అద్భుతరీతగా గొల్గతాచుట్టు ఆవరించింది. గేలిచేసే కార్యక్రమం జనసమూహపు పెదవులపై మృతిచెందినట్లుంది. భక్తి పూర్వకమైన భయం - ఆందోళన ప్రతి హృదయాన్ని ఆవరించినట్లుంది. సిలువపై నుండి వేదన అనుభవించుతున్నవారి కేకలు - ఎగయూపిరి ధ్వనులు మాత్రమే నిశబ్ద వాతావరణాన్ని భంగం చేస్తున్నట్టున్నాయ్. ఆ చీకటినీ, నిశబ్దాన్ని చీల్చుకొంటూ ఆకస్మికంగా మాటల ధ్వని వినిపించింది.

''ఇంచుమించు మూడు గంటలప్పుడు యేసు - ఏలీ, ఏలీ,లామా సబక్తానీ'' అని బిగ్గరగా కేకవేశారు (మత్తయి 27:46). ఈ మాటలు ఆయన బాల్యదినాలకు సంబంధించినవట; ఇవి కీర్తనలు 22నుండి తీయబడ్డాయి. ''ఆ మాటకు నా దేవా, నా దేవా, నన్నెందుకు చెయ్యి విడిచితివని అర్థము'' అని మత్తయి వివరించాడు (46b వ.).

''చెయ్యి విడువబడడమనేది'' - నా భాషలో బహు దుఃఖకరమైన పరిస్థితిని సూచిస్తుంది. ''విడనాడడమనేది'' - ''పనికి రానిదన్నట్టు వదలివేయడం; ఒక స్థలంలోగాని, పరిస్థితిలోగాని- ఓడింపబడి, నిస్సహాయ స్థితిలోనికి దిగజారిన,'' అనే భావాన్ని సూచిస్తుంది.

యేసు కేవలం చేయి విడువబడినవారే కారు; ఆయన దేవుని చేతనే విడనాడబడ్డారు. ఇది మానవ జ్ఞానానికి అందనిది, అది మనలను విమోచనా మర్మాల లోనికే కొనిపోతుంది. యెషయా 59:1-2లో పాపం మనలను దేవునినుండి ఎడబాపు తుందని బోధిస్తుంది. 2 కొరింథీ. 5:21లో ''పాపమెరుగని ఆయనను మనకోసము పాపముగా చేసెను'' అని వ్రాయబడింది. యేసు మన కొరకు పాపముగా చేయ బడినప్పుడు మన పాపపు శిక్షను ఆయన భరించారు. పాపానికి కడాపటి శిక్ష- దేవునిచే విడనాడబడటమే (2థెస్స.1:9)!

మనలను రక్షించడానికి క్రీస్తు ఎంత దూరం వెళ్లడానికి యిష్టపడ్డారో గమనించావా? మత్తయి 27:46 ఆ దూరమెంతో చూపించబడింది. ఆయన పరలోక మహిమను వదిలారు. అంతేకాదు, ఆయన అంత కంటె బహుదూరం వెళ్లారు. నరరూపిగా ఆయన ఈ లోకానికి వచ్చారు. దాసుని స్వరూపంకూడా ధరించారు. అంతకుమించిన దూరం కూడా ఆయన పయనించారు. ఆయన అవమానాన్ని తిరస్కారాన్ని అనుభవించారు. అది చాలదన్నట్టు యింకా దూరంగా ఆయన సిలువకే వెళ్లారు. అయినా, ఆయన ప్రయాణం ముగియలేదు. మనలను రక్షింపగోరి, దేవునిచే విడనాడబడిన స్థితికి కూడా దిగడానికి ఆయన యిష్టపడ్డారు!

దాన్ని నేనెన్నడూ అర్థం చేసుకోలేను. దాని నంతటిని యేసు మనకొరకు ఎలా చేయగలిగారో? నన్ను - నిన్ను ఆయన అంతగా ఎలా ప్రేమించగలిగారో? దీనికంతటికిపైగా, పాప దోషం యొక్క నిత్య శిక్షను, సిలువపైనున్న కొద్ది కాలంలో, ఆయన ఎలా సహించగలిగారో? అనంతమైన భారాన్ని, యేసు పరిమితియైన కాలంలో ఎలా మోయగలిగారో? దీని నంతటిని విశ్వాసంతో అంగీకరించడమే తప్ప, దీనిని నేను గ్రహించే అవకాశమే లేనట్టుంది. ''చెప్ప శక్యముకాని ఆయన వరమును గూర్చి దేవునికి స్తోత్రము'' (2 కొరింథీ. 9:15).

## అలసియున్న పలుకులు: "నేను దప్పిగొను చున్నాను''
(యోహాను 19:28)

దేశమంతటా మూడు గంటలసేపు చీకటి కమ్మింది. సిలువ చుట్టు నున్న జనులకు వెలుగు మరెన్నడు ప్రకాశింపదేమో నన్నట్టు అనిపించియుంటుంది. చివరికి గండం గడిచింది. చీకటిలోనుండి సూర్యుడు పొడుచుకుంటూ వచ్చాడు. అంధకార సంబంధమైన అధిపతి నీతిసూర్యుని మరుగుచేయడానికి ప్రయత్నించినట్టున్నాడు కాని, అది వానివల్ల కాకపోయింది. ఇప్పుడు, తొలిసారిగా, యేసు వ్యక్తిగత సర్వనామాన్ని (Personal pronoun) వినియోగించారు. ''అటు తరువాత సమస్తమును అప్పటికి సమాప్తమైనదని యేసు ఎరిగి, లేఖనము నెరవేరునట్లు - నేను దప్పిగొనుచున్నాననెను'' (యోహాను 19:28).

ఈ మాటల్లో యేసు కనుపరచిన నిగ్రహశక్తి ఎంతో! (దీన్ని తెలిసికొనడానికిగాను) ఆయన అనుభవించిన వేదనాకరమైన బాధ, నమ్మశక్యంగాని హృదయ ఆవేదనను గూర్చి ఎక్కువగా చర్చించియుంటే బాగుండేదే. యేసు పలికింది గ్రీకులో ఒకే మాటగా ఉంది; తర్జుమాలో (ఇంగ్లీషులో మూడు మాటలుగా చేయబడ్డాయి) తెలుగులో ''నేను దప్పిగొనుచున్నాను'' అని ఉంది.

ఈ మాటల్లో ఉన్న ఒక పాఠమేమంటే - యేసు రక్తమాంసాల్లో పాలివారై యున్నారు. ఆయన ఆకలిగొన్నారు, మనవలె ఆయన దప్పిగొన్నారు కూడా[1]. గనుక ఆయన మనయందు కనికరంగలవారై యుంటారు.

> ''మన ప్రధాన యాజకుడు మన బలహీనతలయందు మనతో సహానుభవములేనివాడు కాడు ... గనుక మనము కనికరింపబడి సమయోచితమైన సహాయముకొరకు కృప పొందునట్లు ధైర్యముతో కృపాసనము నొద్దకు చేరుదము'' (హెబ్రీ. 4:15-16).

యేసు ఆ మాటలు పలికిన సమయం - అంతకంటే ప్రాముఖ్యమైన పాఠాన్ని నేర్పుతుంది. ''సమస్తం సమాప్తమైన తరువాతనే ఆయన ఈ మాటలను పలికారు (యోహాను 19:28). నరకాగ్నిలో ఆయన ఎండగట్టబడినట్టి అనుభవం తరువాతనే ఆయన ఈ మాటలు పలికారు. పాపంతో ఆయన చేసిన పోరులో అలసిపోయినంతగా నిలిచి, జయించిన తరువాతనే; అంటే బహు దూరపు పరుగు పందెంలో గమ్యాన్ని చేరినవాడు ... అలసి, పడిపోయి, ''నేను దప్పిగొ నియున్నా'' నన్నట్టుగా యిది ఉంది.

## విజయాన్ని సూచించే పలుకులు: "సమాప్తమైనది" (యోహాను 19:30)

గెలుపుపొందిన పలుకులకు రంగస్థలం సిద్ధం చేయబడింది. సిలువలో జరిగిన యుద్ధ ఫలితాల విషయంలో ఎవరికైనా సందేహముంటే - యోహాను 19:30ని చూడవచ్చు. ''యేసు ఆ చిరక పుచ్చుకొని, సమాప్తమైనదని'' చెప్పెను అని వ్రాయబడింది.

ఆది భాషలో - "tetelestai'' (టెటెలెస్టాయ్) అని ఉంది. దీనికి గ్రీకులో సంపూర్ణమైన అర్థం: చెల్లించబడింది; లేక తత్ఫలితంగా శాశ్వతంగా ముగించబడింది. ఈ పదాన్ని వ్యవసాయదారులు వాడుతూ ఉంటారట! తన మందలోనికి ఒక దూడ ఒరుగు వంకలేకుండ పుడితేనట - ''టెటెలెస్టాయ్, టెటెలెస్టాయ్'' అని అరుస్తాడట! ఈ పదం చిత్రకారునిచే ఉపయోగింపబడిందనుకో! తన శిల్పమో, లేక చిత్ర లేఖనమో కడసారి మలుపులు, తిప్పబడిన తరువాత, తన పటానికి లేక పనికి కొన్ని అడుగుల దూరం వెళ్ళి, దాన్ని చూచుకొంటూ అభినందిస్తాడు. తాను దిద్దుబాటు రూపంలో తన శిల్పానికో, చిత్రానికో చేయవలసింది యిక ఏదీలేనప్పుడు - ''టెటెలెస్టాయ్'' అని తనలో తాను మెల్లగా అనుకుంటాడట! ఈ సందర్భంలో ప్రభువైన యేసుచే ప్రయోగింపబడిన పదం యిది! సిలువకు దిగువ భాగాన నిలిచిన జనం - ''యేసు జీవితం వ్యర్థం చేయబడిందని'' అనుకుంటుంటే, సిలువపై నిలిచిన యేసు - ''అది జయ జీవితమే''యని చాటారు.

''సమాప్తమైనదని'' యేసు చెప్పినప్పుడు, ఆయన తన జీవితపు ముగింపును సూచించడంలేదు. కాని తాను చేయవచ్చిన పనిని నెరవేర్చానని ఆయన చెప్పారు. ఆయన చేయుటకు వచ్చిన పనులలో పాత నిబంధనను నెరవేర్చడం ఒకటి (మత్తయి 5:17). ఆయన దాన్ని ముగించారు. దానితో క్రొత్త నిబంధన ప్రవేశపెట్టబడేలా, పాత నిబంధన ప్రక్కన పెట్టివేయబడింది (హెబ్రీ. 9:15-16, 10:9). పాత నిబంధన ముగించబడింది (కొలస్సీ. 2:14). పది ఆజ్ఞలుగా ఉన్న ధర్మశాస్త్రం ముగించివేయ బడింది (2 కొరింథీ. 3:1-11). ఏడవ దినపు సబ్బాతు ముగించ బడింది (కొలస్సీ. 2:16).

రక్షణను ప్రసాదించడంలోని ప్రధాన ఘట్టం ముగించబడింది! యెషయా 53:6 యొక్క పని ముగించబడింది. ''మన మందరము గొర్రెలవలె త్రోవ తప్పిపోతిమి. మనలో ప్రతివాడును తన కిష్టమైన త్రోవకు తొలిగెను. యెహోవా మన యందరి దోషములను అతనిమీద మోపెను'' 1తిమోతి 2:6లో చెప్పబడిన పని ముగించ బడింది: ''ఈయన అందరి కొరకు విమోచనా క్రయధనముగా తన్ను తానే సమర్పించుకొనెను'' ప్రకటన 5:9లో సూచింపబడిన పని ముగించబడింది: ''నీవు ... యోగ్యుడవు, నీవు వధింపబడినవాడవై, నీ రక్తమిచ్చి, ప్రతి వంశములోను, ఆయా భాషలు మాట్లాడు వారిలోను ప్రతి జనములోను, దేవునికొరకు మనుష్యులను కొని ...''

భద్రం సుమా! ఇప్పటికి ప్రభువైన యేసు పాత్ర మాత్రమే ముగించబడింది - మానవ భాగం అప్పటికి యింకా మిగిలే ఉంది. జార్జి ఫ్రెడ్‌రిక్ హేండెల్ - ''మెస్సీయా'' అనే తన రచనను ముగించి - ''సమాప్తమయ్యిందని'' చెప్పాడు. కేవలం రచన మాత్రమే ముగిసినంత మాత్రాన దానివలన కలిగే లాభమేముంది? అలాగే

ప్రభువైన యేసు పాత్ర ముగించబడింది వాస్తవమే గాని, (దాన్ని తగిన తీరులో జనులు పొందాలే) పొందినవారు ''తమ సొంత రక్షణను భయముతోను వణకుతోను కొనసాగించు''కోవాలే (ఫిలిప్పీ. 2:12).

## అప్పగింత పలుకులు: "నీ చేతికి ..." (లూకా 23:46)

దుఃఖకరమైన భాగం చాలవరకు అంతరించినట్లే. ఇంకా కొన్ని మాటలే ఆయన పలకాలి. ఈ జీవితాన్ని వదలివేయడానికి ప్రభువైన యేసు సిద్ధంగా ఉన్నారు. ''అప్పుడు యేసు గొప్ప శబ్దముతో కేకవేసి-తండ్రీ, నీ చేతికి నా ఆత్మను అప్పగించుకొనుచున్నాననెను. ఆయన యీలాగు చెప్పి ప్రాణము విడిచెను'' (లూకా 23:46). విషయం పిలాతుకు తెలిసినప్పుడు ''ఆయన ఇంతలోనే చనిపోయెనా అని'' ఆశ్చర్యపడ్డాడు (మార్కు 15:44)[11]. గతంలో - ''ఎవడును నా ప్రాణము తీసికొనడు; నాయంతట నేనే దాని పెట్టుచున్నాను; దాని పెట్టుటకు నాకు అధికారము కలదు, దాని తిరిగి తీసికొనుటకు నాకు అధికారము కలదని'' యేసు సూచించారు (యోహాను 10:17-18). మరణం యేసు నొద్దకు రాలేదు; ఆయనే దాని కలిసికోడానికి వెళ్ళారు.

సాధారణంగా, యిలాటి పరిస్థితిలో - మరణానికి ముందు, ప్రకృతియొక్క సహజమైన చర్యను బట్టి- ప్రాణవాయువుతో ఊపిరి తిత్తులను నింపునట్లు వ్యక్తి తన తలను పైకిలేపుతాడు - తదనంతరం తల దిగిపోతుంది. ప్రభువైన యేసైతే, ''తలవంచి ఆత్మను'' అప్పగించారు (యోహాను 19:30b) అంటే తన ప్రాణాన్ని తానే దారపోసినట్లు తెలుస్తుంది. ''ఇవ్వాలనుకున్నారు; గనుక ఆయన తన ప్రాణాన్ని యిచ్చారు. ఆయన ఎప్పుడు యివ్వదలచుకొన్నారో, ఎలా యివ్వదలచుకున్నారో అలాగే యిచ్చారని'' - ఆగస్టీన్ అన్నాడు.

విమోచనా కార్యక్రమాన్ని యేసు ముగించుతూ, ''తండ్రీ, నీ చేతికి నా ఆత్మను అప్పగించుతున్నా''నని ఆయన అన్నారు (లూకా 23:46). మరణమందు యేసు తన ఆత్మను దేవునికి అప్పగిస్తున్నారంటే తన జీవితకాలమంతా ఆయన దేవునికి అప్పగించుకునే జీవించారు. అలాగే నేను, నీవు కూడా- మరణంలో మన ఆత్మ దేవునికి అప్పగింపబడేలా, జీవించుతున్న ఈ దినాల్లో దాన్ని ఆయనకు అప్పగించి జీవింపవలసి యుంటుంది.

## ముగింపు

సిలువపైనుండి యేసు నేర్పించిన గొప్ప పాఠాలు: క్షమాపణ, నిరీక్షణ, ఒంటరి తనం, శ్రమ, అలసట, విజయం, అప్పగింత - అనేవి! ఈ పాఠాలు మనకు ప్రయోజనకరంగా ఉండాలనుకొంటే - వాటిని నేర్పిన ప్రభువుతో సజీవమైన

బాంధవ్యాన్ని మనం పెంచుకోవాలి. గలతీ. 3:26-27 పౌలు ఈ సంగతులను యిలా గుర్తిస్తున్నాడు: ''యేసు క్రీస్తునందు మీరందరు విశ్వాసమువలన దేవుని కుమారులై యున్నారు. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించు కొనియున్నారు''.

విశ్వసించి బాప్తిస్మం పొందుట ద్వారా క్రీస్తును ధరించుకొన్న మీదట మనం ఆయనను వెంబడించడానికి - అవసరమైతే మరణం వరకు యిష్టపడినవారమై యుండాలి. ''- ఎవడైనను నన్ను వెంబడింప గోరినయెడల తన్నుతాను ఉపేక్షించు కొని, ప్రతిదినము తన సిలువను ఎత్తికొని నన్ను వెంబడింపవలెనని'' ప్రభువు చెప్పారు (లూకా 9:23). మనకై ప్రభువు చేసిన దాన్ని అభినందిస్తున్నావా? అలా అభినందించిన పక్షంలో ఎక్కడైనా, ఎప్పుడైనా ఆయనను వెంబడించడానికి మనం సిద్ధపడియుంటాం!

---

సూచనలు

[1]రక్షణకు బాప్తిస్మం అవసరంలేదని చెప్పేవారు - తమ విశ్వాసానికి ''రుజువుగా'' ఉన్నట్లు సిలువపై దొంగను తరుచుగా పాడుతూ ఉంటారు.

[2]ఆ దొంగ రక్షింపబడ్డాడన్న వాస్తవాన్ని కొందరు సందేహించుతున్నారు. ''పరదైసు'' అనే పదానికి అక్షరార్థం- ''ఉద్యానవనం'' అని! పరదైసు అనే మాటకు అక్షరార్థమేమైయున్నా, వాస్తవానికి ఇది ''అబ్రాహాము రొమ్ము'' (లూకా 16:23) అనే దానికి సమానంగా ఉన్నట్టుంది. తీర్పువరకు నీతిమంతులు వేచియుండు చోటును చూచిస్తూ, ప్రభువైన యేసు, తాను మృతిపొందిన తరువాత, అక్కడికి వెళ్లియున్నట్టు పేతురు చూచించాడు (అపొ 2:27, 31). (మృతులు ఉండు అదృశ్య లోకాన్ని హేడెస్ అని అంటారు). అప్పుడు ప్రభువైన యేసు - అబ్రాహాము-లాజరు ఉన్న చోటులో ఉన్నారనేది నిస్సందేహం. '' ఆ దినముననే'' ఆ దొంగ ప్రభువుతోకూడా పరదైసులో ఉంటాడని ఆయన వాగ్దానం చేశారు.

[3]సిలువపై దొంగవలె మనం కూడా రక్షింపబడతామనే భావనను వ్యక్తపరచేవారు. రక్షణకున్న షరత్తులలో బాప్తిస్మాన్ని తీసివేయాలనే దృష్టితోనే మాట్లాడుతున్నారు. ఆ దొంగయొక్క మార్పు బైబిలు (చరిత్రలోనే) అతి కష్టమైనదన్న సంగతిని వారెన్నడు కనీసం ఆలోచన కూడా చేయకున్నట్టున్నారు. వాస్తవానికి, అనేకులు తన విశ్వాసాన్ని కోల్పోతున్న సమయంలో, అతడు ఆయనను నమ్మవచ్చాడు. యూదులు ముందుగా మెస్సీయాను గూర్చి ఏర్పరచుకొన్న తప్పుడు భావాలలో మునిగి తేలుతూ ఉన్న సమయంలో- అతడు వాటిని అధిగమించాడు. అనేకుల స్వరాలు ఆయనను నేరస్థునిగా ఎంచి, శిక్షకు పాత్రుడని శపించుతున్నప్పుడు, అతడు ఆయన పక్షంగా మాట్లాడాడు. తన శరీరంలోను, మనస్సులోను భరింపశక్యంకాని బాధలో ఉండికూడా, అతడీపని జరిగించాడు. ఆ దొంగ ఉన్న స్థితిలో నిలిచియుండి, రక్షణ పొందగోరేవాడు నేటి దినాల్లో ఎవడైనా ఉన్నాడంటే - నేను బహుగా సందేహిస్తాను.

[4]మత్తయి 20:1-16

[5]ఆ రెండింటి మధ్యనున్న సిలువ బరబ్బాకు చెందినదే! మిగిలిన ఆ యిద్దరు దొంగలు దాదాపు అతని అనుచరులైయుండవచ్చు. బరబ్బావలె వీరుకూడా- అల్లరి, హత్య, బందిపోటు విషయంలో దోషులైయుండవచ్చు (యోహాను 18:40; లూకా 23:19).

[6]యోహాను 7:5 యేసుయొక్క సహోదరులు ఆయన మరణ సమయంలో అవిశ్వాసులైయున్నా, ఆయన పునరుత్థానం తరువాత, వారిలో కొందరో లేక అందరో- క్రైస్తవులయ్యారు (అపొ. 1:14).

[7]ప్రభువైన యేసు తన తల్లియైన మరియను యోహానుకు అప్పగించడం చూస్తే, ఆయనకు చట్ట సంబంధమైన యోసేపు చనిపోయినట్టు - అది సూచిస్తుంది. యేసుయొక్క పరిచర్య కాలంలో కూడా యోసేపు ఎక్కడా కన్పించడు గనుక, ఆయనకు ముప్పైయేండ్లు నిండకముందే అతడు చనిపోయి ఉండవచ్చు.

[8] మత్తయి 4:2; యోహాను 4.

[9] సిలువయొద్ద నిలిచియుండడమనేది సహజంగానే మరియకు కష్టతరమై యుండవచ్చు. అయినా, ఆమెను అక్కడ నుండి తీసికొని వెళ్లడంకూడా చిన్నపనేమీ కాదు. ఏది ఎలాగున్నా, కడకు మరియ మేలుపొందింది. యేసుతో ఆమెకున్న ప్రకృతి సంబంధమైన (మాతృ) బంధంనుండి, క్రీస్తుతో తనకుండే ఆత్మ సంబంధమైన బంధానికి ఆమె కొనిపోబడింది. యేసు తనకు కుమారుడైయుండే దానికంటే, రక్షకుడైయుండడమే శ్రేష్టమైయున్నట్టు ఆమె కనుగొన్నది.

[10] యేసు సిలువలో ''నరకవేదన ననుభవించారని'' చెప్పడం అసందర్భమైయుండదు (2థెస్స. 1:7-9).

[11] సిలువలో ప్రత్యేకించి ఏ జీవనేంద్రియం కూడా నేరుగా బాధింపబడలేదు గనుక, సిలువ వేయబడిన వ్యక్తి చనిపోడానికి కొన్ని దినాలు పట్టడం అసాధారణం కానేరదు. ఆ యిరువురి (దొంగల) మరణాన్ని తొందర పెట్టేలా, సైనికులు వారికాళ్లను విరుగగొట్టారు (యోహాను 19:31-33). వారి కాళ్లను తన్ని పైకిలేచి, గాలి పీల్చుకొనడమనే చర్య దీనితో మాన్పబడుతుంది. గనుక మరణం తొందరగా వస్తుంది; అంటే, తొందరలో ప్రాణం పోతుందన్న మాట!